ఆమెను ప్రేమించిన ఆ ఇద్దరూ ఎలా మోసపోయారు?

పి.కపీందర్ రెడ్డి కథ

పిచ్చివాళ్ళు

"నిన్నటివరకు కొత్త వంద రూపాయల నోటులా, అప్పుడే జీతం డబ్బు తీసుకున్న ఉద్యోగిలా, మంత్రివర్గంలో సీటు లభించిన ఎం.ఎల్.ఏగా తళతళలాడుతూ ఓ వెలుగు వెలిగిన మీరు ఇంతలోనే కుడితిలోపడ్డ ఎలుకలా, మంత్రివర్గానికి రాజీనామా చేసిన మినిస్టర్‌లా ఫీలవుతూ ఈ వయసులో సన్యాసం పుచ్చుకుంటానంటావేం...?" అడిగాడు అప్పారావు పక్కింటి పార్వతీశాన్ని.

"ఏం చెప్పను నాయనా... అదంతా ఓ పెద్ద కథ. నా కథంతా వినాలని నీకు సరదాగా వుంటే ఆఫీసుకి సెలవెట్టి, పని పాటంతా వదలిపెట్టి ఓ రోజంతా నాతో కూచోవాల్సిందే" వేదాంత ధోరణిలో చెప్పాడు పార్వతీశం.

"ఫర్వాలేదులెండి. ఆల్‌రెడీ నేను సెలవుమీదే ఉన్నాను. మీ కథేంటో చెప్పండి. వింటానం"టూ కుర్చీలో కూలబడ్డాడు అప్పారావు.

"నీవు మరీ అంత బలవంతం చేస్తున్నావు. అందులోనూ పక్కింటి ప్రాణమిత్రుడివి. చెప్పక తప్పుతుందా? విను... మన తెలుగు సిన్మాలు, టీవీ సీరియల్స్ చూసీ, చూసీ నేనో నిర్ణయానికొచ్చాను. అదేంటంటే, ఎవర్నైనా అమ్మాయిని ప్రేమించే పెళ్ళి చేసుకోవాలని. ప్రేమించడంలో ఎంత థ్రిల్లుంటుందో ఎన్నో సిన్మాలలో చూశాక ఆ థ్రిల్‌ని నాకూ అనుభవించాలనిపించింది. అంతే... వెంటనే కూరగాయల మార్కెట్ కెళ్ళాను. ఎవర్నో ఒకర్ని ప్రేమించాలి గాబట్టి ఎర్రగా, బుర్రగా, చలాకీగా ఉన్న ఓ అందమైన అమ్మాయిని చూసి ధైర్యం చేసి

చిరునవ్వు చిందించాను. ఆశ్చర్యం... ఎడం కాలి చెప్పుతో సత్కారం చేస్తుందని లోలోప లే భయపడ్డాను. కానీ, నేను భయపడ్డట్టు జరగలేదు. ఆ అమ్మాయి సైతం నన్ను చూసి స్టైల్‌గా ఓ చిరునవ్వు నవ్వింది."

"ఆ తర్వాత..." కుతూహలంగా అడి గాడు అప్పారావు.

"ఇంకేముంది. మన తెలుగు సిన్మాలోలా

మా ప్రేమ క్షణాల మీదే చిగురించింది. ఇద్దరం కలిసి అలా హోటల్‌కెళ్ళి స్వీటుకి ఆర్డరిచ్చాము. మధ్యమధ్యలో ఒకటేమిటి... ఎన్నో, ఎన్నెన్నో తీయటి కబుర్లు. వెన్నెల్లో తేలిపోతూ, ఆనందసాగరంలో ఊగిపోయాం... నీకూ నీ వారు లేరు. నాకూ నా వారు లేరు. ఇద్దరం అన్యోన్యంగా, ఆదర్శంగా, హాయిగా చిలకా, గోరింకల్లా కాపురం చేద్దామని ప్రమాణం చేసుకున్నాం.''

''ఇంకేందయ్యా పార్వతయ్య, ఇంత ఇంట్రస్టింగ్ లవ్‌స్టోరీ పెట్టుకుని తెలివితక్కువ వాడిలా సన్యాసం పుచ్చుకుంటావంటావేం? ఏ లవ్‌స్టోరీని ఏ సినిమా నిర్మాతకైనా పంపించు. సినిమా సూపర్‌హిట్టవుతుంది. కనకవర్షం కురుస్తుంది'' అన్నాడు అప్పారావు తనకి తోచిన సలహా పారేస్తూ.

''అక్కడే పప్పులో కాలేశావయ్యా అప్పారావు. కథంతా వినకుండా ఇలా మాటిమాటికీ పప్పులో కాలేస్తే నేను చెప్పకుండా ఆపేస్తానంతే'' చిరుకోపంతో అన్నాడు పార్వతీశం.

''ఏంటి... నేను పప్పులో కాలేశానా? అంటే స్టోరీ మరో మలుపు తిరిగిందనేగా అర్థం... అయితే, చెప్పు... చెప్పు... ఈసారి నన్తే అడ్డురాన్లే'' అంటూ లెంపలేసుకున్నాడు అప్పారావు.

''అలా కూరగాయల మార్కెట్లో చూపులు కలసిన మా ప్రేమ పున్నమిచంద్రుడిలా దినదినాభివృద్ధి కాసాగింది. రోజురోజుకీ విడదీయరాని బంధంగా పెనవేసుకుపోయింది. ఒకరంటే ఒకరం విడిచి ఉండలేని పరిస్థితి కొచ్చాం. ఇలా మా ప్రేమ మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిలుతున్న సమయంలో ఓ రోజు ఆ అమ్మాయి నా దగ్గరికొచ్చి ''ఏమండోయ్... నాకు అర్జంటుగా ఓ లక్ష రూపాయలు అవసరం. మీ దగ్గరుంటే ఇవ్వండి. రేపు బ్యాంకు నుంచి నా డబ్బు డ్రా చేసి ఇచ్చేస్తాను. మన ప్రేమ మీద ఒట్టు'' అంటూ నన్ను కవ్వించి, నవ్వించి, ఒప్పించి లక్ష పట్టుకెళ్లింది.''

''తిరిగి ఇచ్చిందా...?'' టెన్షన్‌గా అడిగాడు అప్పారావు.

''ఆ ఇచ్చింది గూబ గుయ్యిమనేలా...!'

''అంటే... కొట్టిందా?''

''నా జీవితం మీదే చావుదెబ్బకొట్టి వెళ్ళిపోయింది.''

''ఏ స్టోరీ యమ సస్పెన్సుగుందయ్యా.. ఇంతకీ ఆ తర్వాతేం జరిగిందో కాస్త అర్థమయ్యేలా చెప్పు.''

''నా దగ్గర లక్ష రూపాయలు పట్టుకెళ్ళిన తర్వాత నా లవర్ నన్నిక కలువలేదు. ఆమెని కలుద్దామని నేనే వాళ్ళింటికెళ్ళాను. ''నిన్నరాత్రే ఎవరికీ చెప్పకుండా ఆర్నెల్ల ఇంటి అద్దె సైతం ఎగ్గొట్టి చల్లగా జారుకుంది. ఇంతకీ ఆ మహాతల్లి నిన్ను సైతం మోసం చేసినట్టుందే...?'' వెక్కిరించినట్టుగా అంది ఆ ఇంటావిడ. చావు కబురు చల్లగా చెప్పినట్టయింది. ఆ క్షణంలో కళ్ళు తిరిగినట్టనిపించింది. ప్రపంచమంతా శూన్యంలా తోచింది. ఇక ఆ క్షణాన దారెటో తెలీక, సర్వం పోగొట్టుకున్న బికారిలా, దిగాలుగా ఇంటికొచ్చి పడ్డాను. జీవితాంతం కష్టపడి సంపాదించిన లక్ష రూపాయలు

పోయిన బాధొకవైపు... మరోవైపు ప్రేమ, దోమంటూ తీయని కబుర్లు చెప్పి చల్లగా జారుకున్న ప్రేయసిని తలచుకోగానే జీవితం మీద విరక్తి పుట్టింది. అడవుల్లోకి వెళ్ళి తపస్సు చేస్తూ... జీవితాంతం అక్కడే ప్రశాంతంగా గడపాలనుంది. ఈ విషయం చివరిసారిగా మా ఊరివాళ్లకి చెప్పి వెళ్దామని మా మండలానికెళ్తే ఈ కమండలం, రాగి చెంబు చందాలు వేసుకుని కొనిచ్చారు. ఇక వెళ్ళిపోతున్నాను అప్పారావు'' పూడుకుపోయిన గొంతుకతో బాధగా అన్నాడు పార్వతీశం.

అప్పారావు కథంతా విని పకపకా బిగ్గరగా నవ్వసాగాడు.

''ఇదేంటయ్యా... ఇంతవరకు నా స్టోరీయమ సస్పెన్స్, గిస్పెన్స్ అంటూ టెన్షన్‌తో మహా ఇంట్రస్టింగ్‌గా విని ఇంతలోనే అంతగా నవ్వొచ్చిందంటే ఇంతకీ నీ ఉద్దేశ్యం...?'' చిరుకోపంతో అడిగాడు పార్వతీశం

''నవ్వక ఏం చేయమంటావయ్యా... నీ అంత అమాయకుణ్ని నేనెక్కడా చూడలేదు. 'టే నమ్ము... లవ్వంటే, లవరంటే ఎలా ఉండాలి... ఆ మాత్రం తెలియదా? అదంతా తెలియనందుకే అమాయకుడిలా బోల్తా పడ్డావు. నన్ను చూడు... నేనూ నీలాగే ఓ అమ్మాయిని ప్రేమించాను. మీలాగే లవ్వాడుకున్నాం. ఎన్నో... ఎన్నెన్నో తీయని కబుర్లు చెప్పుకున్నాం. పైవారం పెళ్ళి సైతం చేసుకోవాలనుకున్నాం. అయితే ఇక్కడొక విచిత్రమేమిటంటే, నీ లవర్ లాగే నా లవర్ నిన్న నా దగ్గరికొచ్చి ''చాలా ఇబ్బందుల్లో ఉన్నాను. ఓ లక్ష రూపాయలుంటే ఇవ్వు. రేపు మన సంబంధం మాట్లాడటానికి మా నాన్నగారొస్తున్నారు. ఆయన వచ్చేటప్పుడు వెంట డబ్బు తీసుకురమ్మని మా నాన్నకి ఫోన్ చేసి చెప్పాను. సరేనన్నాడు

మా నాన్న పెద్ద బిజినెస్ మ్యాన్. బాంబేలో పెద్ద పెద్ద బిల్డింగులు, ఫ్యాక్టరీలు ఎన్నో ఉన్నాయి. నాన్న రేపు తప్పక వస్తాడు. రాగానే ఇస్తాన''ని చెప్పి ఓ లక్ష రూపాయలు

[illegible] కళ్ళింది. ఈ [illegible]
వచ్చాడేమోనని వాళ్ళింటికెళ్ళి చూసొచ్చాను

ఇల్లు తాళం వేసుంది. బహుశా వాళ్ల నాన్నగార్ని తీసుకురావడానికి బస్‌స్టేషన్‌కి వెళ్ళుంటుంది. వాళ్ల నాన్నగారు రాగానే నా లక్ష రూపాయలు నాకు ఇచ్చేస్తుంది. అంతేకాదు. మా పెళ్ళి జరిగి వెంటనే ఈ వెధవ ఎల్.డి.సి ఉద్యోగానికి రాజీనామా పెట్టేసి నేను కూడా మా మామగారితో కలిసి బాంబే వెళ్ళి పెద్ద బిజినెస్ మ్యాన్‌వై పేరు, ప్రఖ్యాతులు సంపాదిస్తాను. అనతికాలంలోనే చరిత్ర సృష్టిస్తాను. నువ్వు చూస్తుండగానే ఎంతో ఎత్తుకు ఎదిగిపోతాను. చూస్తుండు. లవ్వంటే... లవరంటే అలా వుండాలి. ఇంతకీ నే చెప్పేది వింటున్నావా? లేకపోతే నా అదృష్టం చూసి కళ్ళు తిరిగిపడిపోయావా?'' తన కథకి తనే పొంగిపోతూ అన్నాడు అప్పారావు.

''మొత్తం మీద అదృష్టవంతుడివయ్యా అప్పారావు. అందరికీ నీలాంటి లవర్స్ దొరకొద్దూ... దేనికైనా పెట్టి పుట్టాలయ్యా ...'' అన్నాడు పార్వతీశం కమండలం వైపు చూస్తూ.

''ఇంతకీ నీ లవర్ పేరేంటో'' కాళ్ళూపుతూ దర్జాగా అడిగాడు అప్పారావు.

''ఆశ...!''

''ఏ ఆశ...!''

''మన వీధి చివరి ఇంట్లోకి ఆర్నెల్ల క్రితం కొత్తగా అద్దెకి దిగిందే... ఆ ఆశ...!''

ఆ మాట వినగానే అప్పారావు తక్కున లేచి నిలబడ్డాడు. ప్రాణం లేని బొమ్మలా

''ఏంటి అప్పారావు... కరెంట్ షాక్ తగిలినవాడిలా అలా అయిపోయావేంటి? ఇంతకీ నీకేమైంది?'' ఆందోళనగా అడిగాడు పార్వతీశం.

''కొంప నిలువునా మునిగిందిరో దేవుడో... నీ లవర్ నా లవర్ ఒక్కరేనని ఇప్పుడే తెల్సిందిరో దేవుడో... ఇప్పుడు నేనేం చెయ్యనురో దేవుడో... ఇల్లు తాళం వేసుంటే వాళ్ల నాన్నగార్ని తోలుకురావడానికి బస్‌స్టేషన్ కెళ్ళిందనుకున్నా. కానీ, నా బ్రతుకునే బస్‌స్టేషన్ చేస్తుందనుకోలేదురో దేవుడో... ఆశ ఎంత నిరాశ చేసిందో దేవుడో'' అంటూ భోరున విలపిస్తూ ఆశ ఇంటిదగ్గరే ఉందేమోనన్న వెర్రి ఆశను చంపుకోలేక మరోసారి చూసిరావడానికి ఆశ ఇంటివైపు పరుగెత్తాడు అప్పారావు.

''పాపం పిచ్చివాడు తాను పిచ్చివాడై నన్ను పిచ్చివాడంటాడా? అయినా నేను మాత్రం ఏం తక్కువ తిన్నాను. మొత్తంమీద టోటల్‌గా ఇద్దరం పిచ్చివాళ్ళమే'' తనలో తానే నవ్వుకుంటూ చెంబు, కమండలం పట్టుకుని బయటికి నడిచాడు పార్వతీశం.

''ఏమండోయ్ పార్వతీశం గారు. మీ వెంట నేనూ వస్తాను కాసాగండి'' వెనుకనుంచి వినిపించింది అప్పారావు గొంతు.